జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

సంతనూతలపాడు:

మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశాభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, మండల పరిషత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు, పైనం ప్రభాకర్, బెజవాడ రాము, మల్లీశ్వరి, నారా సుబ్బారెడ్డి, రామాంజనేయులు, మోరబోయిన సంజీవరావు, మండవ బాలచంద్రమౌళి, వాకా కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ పిట్టల ఆంజనేయులు, షేక్ మజీద్, జయమ్మ, రజిని, ప్రసన్నాంజరెడ్డి, అశోక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ నాయకుల నివాళులు...

చీమకుర్తి: చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎస్.మాణిక్యం, పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, బీమన వెంకట్రావు, గోపురపు చంద్ర, సోమా శేషాద్రి, బొంతా సంతోష్, చింతలపాలెం బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చీమకుర్తి పట్టణానికి చెందిన ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు బొంతా ఏసుదాస్, తొరటి ఆనంద్, పాటిబండ్ల జక్రయ్య, జడ విజయకుమార్, బుట్టి సాల్మన్, కర్నా ప్రసాద్, బిరుదుల లింగయ్య స్థానికులు పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. చీమకుర్తిలోని క్రిస్టియన్‌పాలెం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.


మద్దిపాడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, తదితరులు


చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

వైఎస్సార్ సీపీ ప్రభ నిర్మాణ పనుల పర్యవేక్షణ


ప్రభ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: మండలంలోని రామతీర్థం తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభ నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పర్యవేక్షించారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం ప్రాంగణంలో ప్రభ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండగా శనివారం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన అంజిరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగం ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.


బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మతో రొండా అంజిరెడ్డి

మసాజ్ సెంటర్‌పై దాడి

ఒంగోలు టౌన్: నగరంలో ఒక మసాజ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని నెల్లూరు బస్టాండులో పాత ఎల్ఐసీ భవనం పక్క సందులోని ఒక కాంప్లెక్స్‌లో గల మసాజ్ సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు శనివారం సాయంత్రం 6.30 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. దాంతో టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి స్పా సెంటర్‌పై ఆకస్మికంగా దాడి చేశారు. బాడీ మసాజ్ చేయించుకుంటున్న ఇద్దరు పురుషులను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పాల వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

మద్దిపాడు: పాల వాహనం ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొలచనకోట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొలచనకోటకు చెందిన శ్రావణ్ కుమార్ గ్రామంలోని రహదారి పక్కనున్న అతని తండ్రి టీ బంకు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తూ రోడ్డు పక్కన నడుస్తుండగా, తాళ్లూరు వైపు నుంచి వెల్లంపల్లి వైపు వస్తున్న పాల వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రావణ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.





రూ.272 కోట్ల ఉపాధి వేతనాల చెల్లింపు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం వేతనాల రూపంలో 272 కోట్ల రూపాయలు చెల్లించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం స్థానిక డ్వామా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.35 కోట్ల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించగా 1.29 కోట్ల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. మొత్తం 96 శాతం పనిదినాలకుగానూ 2.95 లక్షల కుటుంబాలలోని 5.06 లక్షల మంది వేతనాలు చెల్లించడం జరిగిందన్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాల పనులకు 180.70 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, తారురోడ్లు, టూరిజం రోడ్లు, ఎస్సీ, ఎస్టీకాలనీలకు అనుసంధానం చేసేందుకు అప్రోచ్ రోడ్లు నిర్మించుటకు 1369 పనులకు పరిపాలనా అనుమతులు తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో 1180 పనులను క్షేత్రస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేసినట్లు చెప్పారు. 141 పనులు పురోగతిలో ఉన్నాయని, దీనికిగానూ 132.02 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10న ఎన్ఆర్ఈజీఎస్ మండల స్థాయి ప్రజావేదిక

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. 1.4.2023 నుంచి 31.3.2024 ఆర్థిక సంవత్సరంలో సంతనూతలపాడు మండలంలో వివిధ శాఖల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు ఈ సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక బృందం మండలంలోని గ్రామాల్లో జరిగిన పనులను తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రజా వేదిక కార్యక్రమానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జిల్లా అధికారులు హాజరవుతారని, మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ మేట్లు, సిబ్బంది పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.



